క్లుప్తంగా

నమో శివరుద్రాయ


ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెం లోని ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉమాదేవి అమ్మ వారికి కుంకుమపూజలు చేశారు. పలురకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం


యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు శ్రీకాంతాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించాయి.

జోన్-5 ఏసీపీ, టీపీవోల బాధ్యతల స్వీకరణ


ఏసీపీ రామకృష్ణ

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ)గా రామకృష్ణ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్(టీపీవో)గా విజయ్‌కుమార్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఉత్తర్వుల మేరకు జోన్-5కు బదిలీ అయినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణను వారు మర్యాద పూర్వకంగా కలిశారు. ఏసీపీ రామకృష్ణ మాట్లాడుతూ జోన్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది, చిత్తశుద్ధితో పనిచేసేలా కృషి చేస్తానని తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలో జరుగుతున్న నిర్మాణాలపై దృష్టి సారించాలని టౌన్ ప్లానింగ్ కార్యదర్శులకు సూచించారు. జీవీఎంసీ 40వ వార్డు నుంచి 63 వరకు వార్డులకు సంబంధించి అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టే వారు జీవీఎంసీ ప్లాన్‌కు దరఖాస్తు చేసుకుంటే ఎటువంటి ఇబ్బందులు ఉండవని జోన్ ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

కేంద్ర మంత్రికి సాదర స్వాగతం



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న కేంద్ర సహాయ మంత్రి అజయ్ కుమార్

గోపాలపట్నం: కేంద్ర సహాయ మంత్రి అజయ్ కుమార్‌కు విశాఖ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ఆయన విశాఖలో జరిగే నేషనల్ జైల్స్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు వచ్చారు. ఆయనకు అధికారులు, నాయకులు స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి నగరంలో సాయిప్రి రిసార్ట్స్‌కు రోడ్డు మార్గాన వెళ్లారు.

నేటి నుంచి ఐడీఆర్‌సీ తరగతులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మానవ వనరుల అభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో పర్యావరణ శాస్త్రంపై ఇంటర్ డిసిప్లీనరీ రిఫ్రెషర్ కోర్స్ నిర్వహించనున్నట్లు హెచ్‌ఆర్‌డీసీ కేంద్రం సంచాలకుడు ఆచార్య టి.వి.కృష్ణ తెలిపారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ తరగతులను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. శిక్షణ తరగతులకు సమన్వయకర్తగా ఏయూ పర్యావరణ శాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యులు ఇ.ఉదయ భాస్కరరెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు.

దివ్యాంగుల అభ్యున్నతికి ప్రోత్సాహం

- సమగ్ర శిక్ష సహిత విద్య పరిశీలకులు డాక్టర్ రామ్‌కమల్, నరసింహం


దివ్యాంగులకు వినికిడి యంత్ర సామగ్రి అందజేస్తున్న పరిశీలకులు డాక్టర్ రామ్‌కమల్, నరసింహం

పరవాడ: దివ్యాంగుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్య పరిశీలకులు డాక్టర్ రామ్‌కమల్, డాక్టర్ వై.నరసింహం చెప్పారు. పరవాడ భవిత కేంద్రాన్ని సమగ్ర శిక్ష సహిత విద్య పరిశీలకు ల బృందం సోమవారం సందర్శించింది. భవిత కేంద్రంలో దివ్యాంగుల కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను తల్లిదండ్రులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. భవిత కేంద్రంలో 27 మంది బుద్ధిమాంద్యం కలిగిన చిన్నారుల అవసరాలు తీర్చడానికి వీలుగా ప్రభుత్వం రూ.2.70లక్షలతో సమకూర్చిన బోధన సామగ్రి కిట్లు, వినికిడి లోపం కలిగిన ఆరుగురు చిన్నారులకు రూ.1.80 లక్షల విలువైన వినికిడి యంత్రాలను పరిశీలకులు రామ్‌కమల్, నరసింహం అందజేశారు.

అనంతరం కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. సింహాద్రి ఎన్టీపీసీ సౌజన్యంతో నిర్మించిన భవిత కేంద్రం పరిశీలించి ఎన్టీపీసీ యాజమాన్యాన్ని అభినందించారు. అనకాపల్లి సహిత విద్య సమన్వయకర్త శకుంతల భవిత కేంద్ర పురోగతిని పరిశీలకులకు వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి దివాకర్, భవిత కేంద్ర ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాస్, మహాలక్ష్మినాయుడు, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చంద్రబాబును కఠినంగా శిక్షించాలి


మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

సింహాచలం: అవినీతికి పాల్పడిన టీడీపీ అధినేత చంద్రబాబు బాగోతాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవా ట్రస్ట్ అధ్యక్షుడు పెనుమత్స శ్రీనివాసరాజు అన్నారు. సుజాత నగర్‌లోని ఆయన నివాసంలో సోమవారం మాట్లాడారు. చంద్రబాబు 14ఏళ్ల ముఖ్యమంత్రిగా కోట్లాది రూపాయలు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ద్వారా 370 కోట్లు అవినీతి పాల్పడటమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇంకా ఇలాంటి అవినీతి బాగోతాలను వెలికితీయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాధనం మింగేసిన వారికి శిక్ష తప్పకుండా పడాల్సిందే అన్నారు. అవినీతికి పాల్పడిన చంద్రబాబుకు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మద్దతు తెలపడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా పవన్ కల్యాణ్ మద్దతు ఉపసంహరించుకోవాలని హితవు పలికారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


విద్యార్థుర్దులకు సూచనలు చేస్తున్న ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్, పక్కన ఎస్ఐ రమేష్

సింహాచలం: పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం ట్రాఫిక్ పోలీసులు రహదారి నింబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ రోడ్డుపై రాకపోకలు సాగించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఏమరుపాటు పనిచేయదని సూచించారు. నలుగురు విద్యార్థులు పక్కపక్కన నిలబడి నడవడం వంటి సంఘటనల వల్ల ప్రమాదాలు జరుగుతున్నట్లు గమనించామన్నారు. దీంతో పాటు ట్రాఫిక్ సమస్యకు కూడా ఆస్కారం ఉందని తెలియజేశారు. రోడ్డుపై నడిచేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలి


మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికులు ఉక్కు పరిశ్రమ కోసం పట్టు వదలక పోరాటం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరి కాదని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. నిర్వాసితుల త్యాగాలు, కార్మికుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రైవేటీకరణ విషయంలో కేంద్రం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 942వ రోజు, సోమవారం సంస్థకు చెందిన డబ్ల్యూ.ఆర్.ఎం-1, 2 విభాగ కార్మికులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని రాష్ట్ర ప్రజలు, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు కోరుతున్నారన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్రానికి ఈ ప్రాంత ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఇప్పటికై నా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశపెట్టాలని, లేకుంటే తమ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'విద్యార్థులకు ఉపయుక్తంగా పుస్తక రచనలు'


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: విద్యార్థులకు ఉపయుక్తంగా పుస్తక రచనలు చేయాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు రచించిన 'ఫిలసాఫికల్ పర్‌స్పెక్టివ్స్ ఆన్ టీచర్ ఎడ్యుకేషన్' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భవిష్యత్ తరం ఉపాధ్యాయు లుగా నిలిచే వారికి, ఉపాధ్యాయ వృత్తిలో అడుగిడే వారికి ఉపయుక్తంగా పుస్తక రచన చేయడం అభినందనీయమన్నారు. పరిశోధకులకు ఈ పుస్తకం ఒక చక్కని మార్గదర్శికంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం పుస్తక రచయిత షారోన్‌రాజును వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య రాంజీ, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జనరల్ యోగా తరగతులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఈ నెల 13 నుంచి జనరల్ యోగా, థెరపీ యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు, ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు నాలుగు బ్యాచ్‌లుగా తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు.

సమాజంపై సాహిత్యం ప్రభావం మెండు


కృష్ణా కళాశాలలో మాట్లాడుతున్న కొలకలూరి ఇనాక్

మద్దిలపాలెం : సాహిత్యం.. సమాజంపై తీవ్ర ప్రభావం చూపిందని ప్రముఖ రచయిత కొలకలూరి ఇనాక్ అన్నారు. మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సోమవారం పద్మశ్రీ అవార్డు గ్రహీత, రచయిత ఇనాక్ సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఘనంగా సత్కరించారు. ఇనాక్ మాట్లాడుతూ గుంటూరు ఏసీ కళాశాల అధ్యాపకునిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఇప్పటి వరకూ 104 పుస్తకాలు రచించానన్నారు. సాహిత్యానికి సమాజానికి అవినాభావ సంబంధం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగం అధ్యాపకురాలు ఆర్.కుసుమ, ఎస్.శారద, గోపాలనాయుడు పాల్గొన్నారు.

హెచ్‌ఎస్‌ఎల్ అధికారులకు ఐఐఎంలో శిక్షణ


శిక్షణకు హాజరైన అధికారులతో ఐఐఎంవీ అధికారులు

ఏయూ క్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ అధికారులకు ఐదు రోజుల కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభమైంది. 23 మంది హెచ్‌ఎస్‌ఎల్‌కు చెందిన మేనేజర్లు హాజరైన ఈ శిక్షణలో ముఖ్యఅతిథిగా హెచ్‌ఎస్‌ఎల్ జనరల్ మేనేజర్ ఎస్.అశోక్ కుమార్ మాట్లాడుతూ నిరంతర అభ్యసనం ప్రాధాన్యతను వివరించారు. ఐఐఎంవీ డీన్(పరిపాలన) ఆచార్య ఎం.వి.అనూరాధ మాట్లాడుతూ నాయకత్వాన్ని పెంచేలా వివిధ సంస్థల అధికారులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. కార్యక్రమ సంచాలకుడు ఆచార్య బాలాజి సుబ్రమణియన్, తదితరులు ప్రసంగించారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన

దాబాగార్డెన్స్: కమ్యూనికేషన్ స్కిల్స్‌పై స్థానిక ఏవీఎన్ కళాశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రీసోర్స్ పర్సన్‌గా విచ్చేసిన సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ప్రొఫెసర్ వీనా స్పందన మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్‌లో నూతన సాంకేతిక విధానాన్ని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఆంగ్ల విభాగాధిపతి పైడి రజని మాట్లాడుతూ ఇంగ్లిష్ భాష ప్రపంచాన్నే శాసిస్తోందని, ఆ భాషపై విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల అధ్యాపకురాలు వినీత సూర్య ప్రసన్న, జీవీఎస్‌వీఎల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

26వ రోజుకు శ్రీలక్ష్మీ పూజలు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు సోమవారం 26వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, తదితరులు పాల్గొన్నారు.

తుప్పపట్టిన విద్యుత్ వైర్ల తొలగింపు


తుప్పు పట్టిన విద్యుత్ వైర్లను తొలగించి కొత్త వైర్లను బిగిస్తున్న సిబ్బంది

పరవాడ: తీరప్రాంత గ్రామాల్లో విద్యుత్ పరమైన సమస్యలను పరిష్కరించడానికి ఈపీడీసీఎల్ సిబ్బంది చర్యలు చేపట్టారు. ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. తీర ప్రాంతం సమీపంలోని ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం గ్రామాల్లో ఉప్పుగాలికి తప్పుపట్టిన వైర్లు తొలగించి నూతన వైర్లు వేశారు. కేశారాలు, యాంగ్లర్లను తొలగించి కొత్త వాటిని అమర్చారు. లోవోల్టేజీ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని ఏఈ శేషసాయి చెప్పారు. సమస్యను పరిష్కరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కానరాని బంద్


సబ్బవరంలో యథావిధిగా నడుస్తున్న వాహనాలు

సింహాచలం: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా ఆ పార్టీ సోమవారం చేపట్టిన బంద్ ప్రభావం అడవివరం, పెందుర్తిలో ఎక్కడా కనిపించలేదు. రోజూలాగే ఆయా రోడ్లన్నీ వాహనాలు, జనసంచారంతో రద్దీగా మారాయి. ఉదయం నుంచే సింహాచలం ఆర్టీసీ డిపోకు చెందిన 105 బస్సులు ఆయా రూట్లలో తిరిగాయి. వ్యాపార, వాణిజ్య సముదాయాలు యథావిధిగా తెరుచుకున్నాయి. పెందుర్తిలో టీడీపీ నేతలు పీలా గోవింద్, పీలా శ్రీను తదితరులు రోడ్డుపైకి రాగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

సబ్బవరం: మండలంలో బంద్ ప్రభావం కనిపించలేదు. దుకాణాలు తెరచుకున్నాయి.ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలు యథావిధిగా రోడ్డు మీద తిరిగాయి. దీంతో రోడ్లు రద్దీగా కనిపించాయి.

పరవాడ: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు నేపథ్యంలో సోమవారం టీడీపీ చేపట్టిన బంద్ ప్రభావం కనిపించలేదు. ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు యథావిధిగా నడిచాయి. ప్రభుత్వ కార్యాలయాలు పనిచేశాయి. వ్యాపారులు తమ దుకాణాలను ఎప్పటిలాగే తెరిచారు. బంద్ నేపథ్యంలో పరవాడ సీఐ పి.ఈశ్వరరావు పెందుర్తి మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ పి.ఈశ్వరరావు, ఎస్ఐ మల్లేశ్వరరావు పటిష్ట చర్యలు చేపట్టారు.

మంత్రి రాజశేఖర్‌కు ప్రముఖుల పరామర్శ


మంత్రి రాజశేఖర్‌తో మేయర్ గొలగాని హరివెంకట కుమారి దంపతులు

గాజువాక: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్‌ను పలువురు ప్రముఖులు సోమవారం పరామర్శించారు. జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి దంపతులు, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మార్టుపూడి పరదేశి, ఎన్నేటి రమణ, బోరా శశిభూషణ్ తదితరులు ఆస్పత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు.

ఘనంగా ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు


పల్లకీ మోస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


పూజల్లో పాల్గొన్న సేవా సమితి సభ్యులు, భక్తులు

పెదగంట్యాడ: ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక వుడా కాలనీ వినాయక నగర్ వుడా ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కృష్ణుడి పల్లకీ ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి సభ్యులు ఎ.శ్రీనివాస్, గణేష్, ఎ.మోహన్ రావు, వై.వి.రమణ, ఉష, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముంచెత్తిన వాన


వుడా కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు


పొంగి ప్రవహిస్తున్న నడుపూరు గెడ్డ


వడ్లపూడి ప్రాంతంలో కురుస్తున్న వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం

పెదగంట్యాడ: వర్షం ముంచెత్తింది. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ బెంబేలెత్తించగా మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మేఘావృతమైంది. చిరుజల్లులతో మొదలై జడివానగా మారింది. ఏకధాటిగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గెడ్డలు, కాలువలు పొంగిపొర్లాయి.. రహదారులన్నీ చెరువులను తలపించాయి. వర్షం ముంచెత్తడంతో మండలంలోని నడుపూరు, హౌసింగ్ బోర్డు కాలనీ, డెయిరీ కాలనీ, బర్మా కాలనీ, రామచంద్రనగర్ తదితర ప్రాంతాలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాల్లోని నివాసితుల ఇళ్లలోకి నీరు రావడంతో అవస్థలు పడ్డారు. రోడ్లన్నీ జలమయం కావడంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు సాగించలేకపోయారు.

కూర్మన్నపాలెంలో..

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం, వడ్లపూడి తదితర ప్రాంతాల్లో జడివానకు రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరడంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు ఎదుర్కొన్నారు.


ఎన్‌టీఆర్ నగర్‌లో కురిసిన వర్షానికి జలమయమైన రోడ్లు

రైల్వే పోలీసుల అదుపులో దొంగ


పట్టుబడిన దొంగతో జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని సోమవారం గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. సోమవారం ఉదయం విశాఖ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై స్లీపర్ క్లాస్ వెయిటింగ్ హాల్ వద్ద జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేస్తున్న సమయంలో స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న కడిమిశెట్టి సతీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇతడి వద్ద నుంచి సుమారు 9 గ్రాముల బంగారంతోపాటు ముత్తూట్ ఫైనాన్స్‌లో గోల్డ్‌లోన్ ద్వారా తాకట్టు పెట్టిన మరో 46 గ్రాముల బంగారాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఎస్ఐ బి.అప్పలనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.